నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్

కొత్తగూడలో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్

కొత్తగూడ/గంగారం, నవంబర్ 27 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు శుద్ధి చేసిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తగూడ, పొగుళ్లపల్లి, ఓటాయి, రేణ్యాతండా, సాయిరెడ్డిపల్లి, గంగారం మండలం కోమట్లగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అక్కడ పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో కలిసి రిజిష్టర్లను తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలును నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తగూడ మండలంలోని సాయిరెడ్డిపల్లి, గంగారం మండలంలోని ఆశ్రమ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను కలెక్టర్ తనిఖీచేశారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, టాయిలెట్లను పరిశీలించి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గంగారం పీహెచ్‌సీని కూడా తనిఖీచేసి, దవాఖానకు వచ్చే రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యాధికారి ప్రత్యూషకు సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గంగారం ఎంపీడీవో అప్పారావు, తహసీల్దార్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కల్తి కాంతారావు, కస్తూర్బా హెచ్ఎం సుజాత, ఎంఈవో రమాదేవి పాల్గొన్నారు.

రేపు వీరభద్రుడికి లక్ష బిల్వార్చన

కురవి, నవంబర్ 27 : మాస శివరాత్రిని పురస్కరించుకొని శుక్రవారం కురవి వీరభద్రుడికి లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. అనంతరం మహా అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు సురభి శ్రీవినాయక నాట్య మండలితో సత్రాల ఆవరణలో గురువారం సాయంత్రం మాయబజార్, శుక్రవారం సాయంత్రం భూకైలాస్ పౌరాణిక నాటకాలు ప్రదర్శించనున్నట్లు వివరించారు.

30 నుంచి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27: జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ (వైజ్ఞానిక ప్రదర్శన)ను ఈ నెల 30, డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ శివారులోని అనంతారం ఆదర్శ పాఠశాలలో ఈ నెల 30న డోర్నకల్, గార్ల, బయ్యారం, కురవి, సీరోల్, మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాల విద్యార్థులు, డిసెంబర్ 1న కేసముద్రం, మానుకోట, నెల్లికుదురు, గూడూరు, కొత్తగూడ, గంగారం, తొర్రూరు, ఇనుగుర్తి, పెద్దవంగర విద్యార్థులు హాజరు కావాలని వివరించారు. సమాచారం కోసం 98495 98281 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'వరి కొయ్యలను కాల్చితే సారం తగ్గుతుంది'

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : పంటలను కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చుతే భూమిలో సారం తగ్గుతుందని మల్యాల కృషి విజ్ఞానం కేంద్రం కోఆర్డినేటర్ మాలతో అన్నారు. బుధవారం పలు మండలాల్లో వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. చాలా వరకు రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపి, వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం భూతాపం, కీటకాలు చనిపోవడం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జగన్

నెల్లికుదురు, నవంబర్ 27 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భూక్యా జగన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మిట్టకొల రవి తెలిపారు. ఈ మేరకు జగన్‌ను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ చెడుపల్లి ఐలయ్య, సిబ్బంది సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27: పట్టణంలోని శ్రీ చైతన్య పారా మెడికల్ ఒకేషనల్ కాలేజీలో బుధవారం మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివి పెడుతున్న చిన్నారి

నాగమణి, సుమలత

నాడు తండ్రి.. నేడు తల్లి..

ఇద్దరి మృతితో అనాథలైన ఆడపిల్లలు

తల్లికి తలకొరివి పెట్టిన చిన్నారి.. ఆదుకోవాలని వేడుకోలు

కురవి, నవంబర్ 27 : కన్న తండ్రి చిన్నతనంలో చనిపోయాడు.. అమ్మమ్మ ఇంట్లో తలదాచుకుందామంటే తల్లిని కూడా మాయదారి రొమ్ము క్యాన్సర్ రూపంలో భగవంతుడు దూరం చేయడంతో ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారాయి. ఈ హృదయ విదారక ఘటన కురవి మండలం బలపాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కురవి మండలం కాంపల్లి గ్రామానికి చెందిన గోల్కొండ వెంట్రాములు, హేమలత దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు నాగమణి, సుమలత ఉన్నారు. పిల్లలు చిన్న పుడే వెంకట్రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో దిక్కు తోచని పరిస్థితిలో ఆడపిల్లలను వెంట బెట్టుకుని తల్లిగారి ఊరైన బలపాలకు హేమలత చేరుకుంది. హేమలత తల్లి నక్క గురువమ్మ సహకారంతో కూలికి వెళ్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. పెద్ద పాప 5వ తరగతి, చిన్న పాప 4వ తరగతి చదువుతోంది. మనసు లేని భగవంతుడు రొమ్ము క్యాన్సర్ రూపంలో తల్లి హేమలతను బుధవారం తెల్లవారుజామున దూరం చేశాడు. గ్రామస్తుల సహకారంతో తల్లి మృతదేహానికి ఇద్దరు చిన్నారులు అమ్మమ్మతో కలిసి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఇది చూసిన ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. అభంశుభం తెలియని చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. మనసున్న మారాజులు సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేసేవారు 6302903136 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

మరిపెడ, నవంబర్ 27 : మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మండలంలోని స్టేజితండా శివారు కుడియాతండాకు చెందిన అశోక్ అదే తండాకు చెందిన ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బుధవారం కోర్టు ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సైబర్ వలలో పడి రూ.4.26లక్షలు పోగొట్టుకున్న యువకుడు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : సైబర్ నేరస్తుల వలలో పడి ఓ యువకుడు రూ.4.26లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ ఎస్సై దీపికా రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని సోమ్లా తండాకు చెందిన ధరావత్ యుగేందర్ హైదరాబాద్‌లో ఉంటూ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి తన ఫోన్‌లో టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో కొంత మొత్తం పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని సైబర్ నేరస్తులు ఆశచూపగా మొత్తం రూ.4,26,699 పెట్టాడు. తర్వాత యాప్ ఓపెన్ కాకపోవడంతో మోస పోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు బాధితుడి తండ్రి వెంకన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నవీన్‌రావు

మరిపెడ, నవంబర్ 27 : మున్సిపల్ కేంద్రంలోని 8వ వార్డు పరిధి ఇందిరాకాలనీకి చెందిన పెండ్ర భూపాల్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు బుధవారం పరామర్శించారు. భూపాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్‌నాయక్, వెంకన్న, పరశురాములు, భద్రయ్య, శ్రీను, భిక్షం, గణేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామంలో కోతులను పట్టిస్తున్న కొమ్మాలు

గూడూరులో కోతుల పట్టివేత

గూడూరు, నవంబర్ 27 : గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. కోతులు గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతూ గ్రామస్తులు, విద్యార్థులు, వృద్ధులపై దాడిచేస్తున్నాయి. ఇండ్లలోకి చొరబడి వస్తువులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తుల ఇబ్బంది తెలుసుకున్న వాంకుడోత్ కొమ్మాలు తన సొంత ఖర్చులతో కోతులను పట్టిస్తున్నారు. బుధవారం కోతులు పట్టేవారిని పిలిపించి, సుమారు 300 కోతుల వరకు పట్టించారు. వీటిని అటవీప్రాంతంలో వదిలివేయనున్నట్లు కొమ్మాలు తెలిపారు. గ్రామంలో కోతులు పూర్తిగా పోయేవరకూ నెల రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వివరించారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : మున్సిపాలిటీ పరిధిలోని శివారు కాలనీలకు వెంటనే మౌలిక వసతులను కల్పించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీ అజయ్ సారథి అన్నారు. బుధవారం పట్టణంలోని 25వ వార్డ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలకు విద్యుత్ సౌకర్యం, తాగు నీరు, అంతర్గత రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పెరుగు కుమార్, మంద శంకర్, రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో భోజన తయారీలో నాణ్యత పాటించాలి

నర్సింహులపేట : కేజీబీవీలో కూర పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్ కుమార్

నర్సింహులపేట/దంతాలపల్లి, నవంబర్ 27 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత పాటించాలని, తాజా కూరగాయాలే వండాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్ కుమార్ సూచించారు. మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో వంటలను బుధవారం ఆయన పరిశీలించారు. వంట వండే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. రోజు ఉపాధ్యాయులు పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, పిన్సిపాల్ ఉన్నారు. అలాగే, దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారం ఎస్సీ హాస్టల్‌ను ఎంపీడీవో వివేక్ రామ్ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో అప్సార్‌పాషా, సిబ్బంది ఉన్నారు.

ఐకమత్యంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం

వాల్ పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న వైద్యులు రంజిత్‌కుమార్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి

తొర్రూరు/చిన్నగూడూరు, నవంబర్ 27 : ఐకమత్యంతోనే సమాజంలో డ్రగ్స్ నివారణ సాధ్యమని ప్రముఖ వైద్యుడు గటిక రంజిత్ కుమార్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. బుధవారం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, నెహ్రూ యువ కేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజ నిర్మూలనకై అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మత్తు పానీయాలు, గంజాయి, డ్రగ్స్ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనకు ఉద్యమంలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు సువర్ణ, ఉప్పలయ్య, చారి, మల్లయ్య, శివరామకృష్ణ, అనిత, ఆలీ రాజ్, హనుమాన్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే, చిన్నగూడూరులోని ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ పాల్గొని అవగాహన కల్పించారు. సిబ్బంది వలియుద్దీన్, రాధాకుమారి, సుమలత, హెచ్ఎం రహమాన్, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, సుగుణాకర్, వెంకట్రామనర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

'హాస్టల్ విద్యార్థుల సమస్యలు పట్టించుకోని డీడీ'

మహబూబాబాద్ రూరల నవంబర్ 27 : జిల్లాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలను డీడీ(డిప్యూటీ డైరెక్టర్) పట్టించుకోవడం లేదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ ఆరోపించారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు జిల్లా కార్యాలయానికి రాకుండా, విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా డీడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒక్కో వార్డెన్‌కు రెండు హాస్టల్స్ అప్పజెప్పుతున్నారని, డైట్ బిల్లుల విషయంలో సైతం కమీషన్లకు పాల్పడుతున్నాడని, డీడీపై వెంటనే ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ నాయక్, ధరావత్ హతిరాం, సోమ్లా నాయక్, రిషి నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకుడు కిషన్

'ఆశ్రమ పాఠశాలలపై సవతి తల్లిప్రేమ'

కురవి, నవంబర్ 27 : ప్రభుత్వ గిరిజన ఆశ్రమపాఠశాలలపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బానోత్ దేవా నాయక్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో కిషన్ నాయక్ మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. కుమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లాలో హాస్టల్ విద్యార్థిని శైలజ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్ని నాయక్, వెంకన్న, రాజా, స్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో గణేశ్

ఎస్సారెస్పీ కాల్వ కోసం సహకరించాలి

దంతాలపల్లి, నవంబర్ 27 : ఎస్సారెస్పీ కాల్వ తవ్వకం కోసం రైతులు సహకరించాలని తొర్రూరు ఆర్డీవో గణేశ్ కోరారు. డీబీఎం 60 ఎస్సారెస్పీ కాల్వ నుంచి 9ఆర్ కాల్వ తవ్వకం కోసం కొంత మంది రైతులు తమ భూములు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ మేరకు బుధవారం రామవరం ప్రాంతంలోని రైతులతో ఆర్డీవో మాట్లాడారు. భూమి కోల్పోతున్న రైతులకు తగు పరిహారం వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాలువ తవ్వకానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ సల్మాన్‌రాజ్, తహసీల్దార్ చంద్రరాజేశ్వర్, డీపీ రాజ్‌కుమార్, ఆర్ఐ నజీముద్దీన్ పాల్గొన్నారు

'విద్యుత్ కనెక్షన్‌కు రైతులు డీడీలు చెల్లించాలి'

నర్సింహులపేట, నవంబర్ 27 : నంబర్ లేకుండా వ్యవసాయ మోటర్‌కు విద్యుత్ వినియోగిస్తున్న రైతులు కనెక్షన్ తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ నరేశ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి మీటర్ కోసం రూ.938 చెలిస్తే ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, డిసెంబర్ నెలలో వ్యవసాయ మోటర్ల బిల్లులు వసూలు చేసే సమయంలో వ్యవసాయ మోటర్లకు నంబర్‌లేని రైతులు విద్యుత్ సిబ్బందికి నగదు చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. ఓవర్ లోడ్ తగ్గించేలా అవసరాన్ని బట్టి అదనపు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏఈ ఆర్ పాండు, సబ్ ఇంజినీర్ షరీఫ్ పాల్గొన్నారు.

రక్షణ లోకల్ ఆటో వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక

ప్రసాద్, అధ్యక్షుడు

రంజిత్, ప్రధాన కార్యదర్శి

తొర్రూరు, నవంబర్ 27 : రక్షణ లోకల్ ఆటో వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని బుధవారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంగలపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లి నరేశ్, ప్రధాన కార్యదర్శిగా గుండాల రంజిత్, కోశాధికారిగా వేల్పుల వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా గద్దల సతీశ్, ఎర్రబెల్లి అశోక్, ప్రవీణ్, గణేశ్, మధుకర్, వెంకన్న ఎన్నికయ్యారు.

వెండి తొడుగు అందజేసిన దాతలు అభిషేక్ రెడ్డి, రాజశ్రీ

చక్రధారేశ్వరస్వామికి వెండి తొడుగు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : మండల పరిధిలోని బంగారు గూడెం చౌలతండాలో పురాతన ఆలయంలోని శ్రీ చక్రధారేశ్వరాస్వామి వారికి పూజారి అమ్మలా కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో దాతలు అభిషేక్ రెడ్డి, రాజశ్రీలు (యూఎస్ఏ) గార్లపాటి సింగారెడ్డి సుమాంజలి బుధవారం వెండి మకర తోరణం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు స్వామి, రవి భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

పెద్దవంగర, నవంబర్ 27 : విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే లక్ష్యంతో చదవాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పదో తరగతి పరీక్షలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర గొప్పదన్నారు. పరీక్షలు సమీపిస్తుండడంతో సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజలింగం, తాఖీ పాషా, ముఖేశ్, అంజయ్య, శ్రీధర్, సత్యం, సారయ్య, ప్రభాకర్, కరుణాకర్, రమేశ్, సువర్ణ, కరుణ, హైమ పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : పట్టణంలోని అనంతారం రోడ్డులో నూతనంగా చేపడుతున్న మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నూతన భవన నిర్మాణ పనులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు గదులను పరిశీలించి వేగంగా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డ్ కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, బానోత్ రవి కుమార్, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, డౌలాగర్ శంకర్, అంబాల శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు దిక్షాదివస్ సన్నాహక సమావేశం

గూడూరు, నవంబర్ 27 : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న జరిగే దీక్షా దివస్ కోసం సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత తెలిపారు. ఈ సమావేశం తన క్యాంపు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలి కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియానాయక్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు హాజరవుతారని వివరించారు.

పెద్దముప్పారంలో అంగన్‌వాడీ కేంద్రం భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

దంతాలపల్లి, నవంబర్ 27 : మండలంలోని పెద్దముప్పారం అంగన్‌వాడీ భవనం, తూర్పుతండా శివారు రేఖ్యతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం రాత్రి డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ వరకు రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేస్తామన్నారు. ఎంపీడీవో వివేక్‌రాం, పీఆర్ డీఈ నర్సింగ్ నాయక్, ఆర్ఐ నజీముద్దీన్, తొర్రూర్ మార్కెట్ వైస్ చైర్మన్ గుగులోత్ భట్టునాయక్, నాయకులు నవీన్‌రెడ్డి, రాంరెడ్డి, బాలాజీ, హరికృష్ణ, సురేశ్, మహేందర్‌రెడ్డి, హరికృష్ణ, గణేశ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు పనులు

ఇనుగుర్తి, వనంబర్ 27 : బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నిధులు రూ.10లక్షలతో మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను ఆయన సోదరుడు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు దేవేందర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వద్దిరాజు రవిచంద్ర ఫోన్‌లో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆ హామీలను అమలు చేసేవరకూ ప్రజల పక్షాన పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ రాంబాబు, ఏఈ మానసారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీకొండ వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, గండు నాగన్న, సత్తూరి యాదగిరి, బొజ్జ నాయక్, కొట్టం చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యూత్ నాయకుడు రమేశ్

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

నర్సింహులపేట, నవంబర్ 27 : మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యూత్ మాజీ అధ్యక్షుడు బండి రమేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నియోజవర్గానికి మంజూరు కావడం సంతోషకరమన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, గరుకుల పాఠశాల లేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రామన్న తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వరరావు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు వైద్యులను ఆదేశించారు. బుధవారం మండలంలోని పర్వతగిరి గ్రామంలో ఆయుష్మాన్ దవాఖానను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు ప్రజలకు అందుబాటు ఉంటూ వైద్య సేవలు అందించాలని, సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. అనంతరం దవాఖాన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోవర్ధన్, శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు పద్మ, కిశోర్, ఏఎన్ఎంలు సరిత, పూల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565